తెలంగాణ అగ్రి సెక్టార్‌లో ప్రస్తుతం అకాల వర్షాలు తెచ్చిన ఊహించని డిజాస్టర్ నెక్స్ట్ లెవెల్ కలకలం రేపుతోంది. ఆరుగాలం కష్టపడి చెమటోడ్చిన రైతన్నల ఆశలు ఈదురుగాలుల బీభత్సానికి నీటిపాలవుతుంటే, పల్లెల్లో ఎక్కడ చూసినా హార్ట్ బ్రేకింగ్ సీన్స్ కనిపిస్తున్నాయి. దాదాపు 100 రోజులు కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికొచ్చే టైమ్‌లో వరుణుడు వేసిన దెబ్బకు ధాన్యం రాశులన్నీ తడిసి ముద్దయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ ప్రాసెస్ నత్తనడకన సాగుతుండటంతో, తడిసిన ధాన్యాన్ని చూసి అన్నదాతలు తీవ్రమైన యాంగ్జైటీలోకి వెళ్లిపోతున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలు కొట్టుకుపోకుండా కాపాడుకునేందుకు 100 శాతం ఎఫర్ట్స్ పెడుతూ, గన్నీ బ్యాగుల సప్లై పెంచాలంటూ రైతులు రోడ్డెక్కుతున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో సిట్యువేషన్ ఒక్కసారిగా హీటెక్కింది, వెంటనే కొనుగోళ్లు స్టార్ట్ చేయాలంటూ రైతన్నలు మెయిన్ రోడ్డుపైనే బైఠాయించి లైవ్ ప్రొటెస్ట్ చేశారు. అటు ఉత్తర తెలంగాణ హబ్ అయిన ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో గన్నీ బ్యాగుల కొరత వల్ల హై టెన్షన్ వాతావరణం క్రియేట్ అయింది. గత 7 రోజులుగా గన్నీ బ్యాగుల కొరత వేధిస్తుండటంతో అధికారులు జొన్న పంటను కొనుగోలు చేయకుండా పెండింగ్‌లో పెట్టారు. ఈ గ్యాప్‌లో గన్నీ బ్యాగుల లోడ్‌తో వచ్చిన ఒక లారీని చూసి, సంచులను దక్కించుకునేందుకు రైతులు పెద్ద సంఖ్యలో ఎగబడటంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గత రాత్రి కురిసిన 30 మిల్లీమీటర్ల భారీ వర్షానికి యావత్ జొన్న పంట తడిసిపోవడంతో, తమ కష్టాన్ని ఎలాగైనా అమ్ముకోవాలనే ఆరాటంతో రైతులు లారీపైకి దూసుకెళ్లడం అక్కడి దీనస్థితికి అద్దం పడుతోంది. ఎండకు ఎండి వానకు తడుస్తూ కొనుగోలు కేంద్రాల వద్దే రోజులు గడుపుతున్నా అధికారుల నుండి ప్రాపర్ రెస్పాన్స్ లేకపోవడంపై రైతాంగం అల్లాడిపోతోంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ పరిధిలో మొక్కజొన్న రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుని నేషనల్ హైవేపైకి చేరింది. మక్కల కొనుగోళ్లను తక్షణమే వేగవంతం చేయాలంటూ రైతులు జాతీయ రహదారిపై బైఠాయించడంతో దాదాపు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ పూర్తిగా జామ్ అయింది. కొనుగోలు కేంద్రాల వద్ద 10 రోజులకు పైగా పడిగాపులు కాస్తున్నా సింగిల్ బస్తా కూడా కాంటా పెట్టకపోవడంపై అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కళ్ల ముందే పంట మొత్తం క్వాలిటీ కోల్పోతుంటే తాము ఎలా బతకాలంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే తాము ఈరోజు రోడ్లపై నిరసన తెలపాల్సి వస్తోందని, తక్షణమే మక్కల దిగుమతి ప్రక్రియను పూర్తి చేయాలని అల్టిమేటం జారీ చేశారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో గత రాత్రి గాలివాన సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు, గంటకు 60 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురుగాలులకు జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామంలో గాలి తీవ్రతకు దాదాపు 15 ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి లోపలి వస్తువులన్నీ రోడ్లపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ విపత్తులో కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ఓపెన్ స్కై కింద ఉన్న వరి ధాన్యం 80 శాతం వరకు తడిసి ముద్దయింది. స్థానిక గోడౌన్ రేకుల కప్పు సైతం ఎగిరిపోవడంతో లోపల భద్రపరిచిన వందలాది ధాన్యం బస్తాలు నీట మునిగాయి. అల్లాదుర్గం మెయిన్ రోడ్డుపై భారీ వృక్షం కూలిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది, సమాచారం అందుకున్న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ స్టార్ట్ చేశారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులుపేట మండలం వస్రం తండా పీఏసీఎస్ కేంద్రం వద్ద మంగళవారం ఒక ఊహించని షాకింగ్ ఇన్సిడెంట్ జరిగింది. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 40 రోజులు గడుస్తున్నా కనీసం పట్టించుకోకపోవడంతో, తీవ్రమైన ఫ్రస్ట్రేషన్‌లో రైతులు ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి తమ నిరసనను ఎక్స్‌ట్రీమ్ లెవెల్‌లో చూపించారు. పండించిన పంటను అమ్ముకోవడానికి ఇన్ని రోజులు వెయిట్ చేయాలా అంటూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కళ్ల ముందే ధాన్యం బస్తాలు కాలిపోతున్నా, తమ బాధను పట్టించుకోని వ్యవస్థపై ఉన్న కోపంతో రైతులు అక్కడే ఆందోళన కొనసాగించారు. ఈ ఇన్సిడెంట్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో విపరీతంగా షేర్ అవుతూ స్టేట్ వైడ్ హాట్ టాపిక్‌గా మారింది. ఇదే జిల్లాలోని తొర్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార గోదాం వద్ద సీన్ చూస్తే రైతుల కష్టాలు పీక్స్‌కు చేరాయనే విషయం స్పష్టమవుతోంది. గత 4 రోజులకు పైగా రైతులు తమ మక్కజొన్న బస్తాల లోడ్‌తో రోడ్లపైనే నైట్ హాల్ట్ చేస్తూ నరకం చూస్తున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలి

- రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలి
- బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిశీలన
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్




**ఆదిలాబాద్, విశాలభారతి:** బజార్ హత్నూర్ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతూ పూర్తిగా అరికట్టాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఈరోజు బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరిశీలించడం జరిగింది. పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామ స్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో సిసిటీవీ కెమెరాల ఏర్పాటు దిశగా కృషి చేయాలని తెలిపారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి, బజార్హత్నూర్ ఎస్ఐ జి రమేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాన కొండయ్య గుట్టపై మైనింగ్ వెంటనే ఆపాలి

**ఉపాధి హామీ కూలీల డిమాండ్**





**దేవరప్పుల, విశాలభారతి:** మండల ప్రాంత ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ మానకొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట పై జరుగుతున్న మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనింగ్ వల్ల దుమ్ము ధూళి పెరిగి పంటల నష్టానికి దెబ్బతింటున్నాయని, కూలీల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడు తుందని తెలిపారు. అలాగే భారీ పేలుళ్ల కారణంగా సమీప ఇల్లు, పురాతన ఆలయానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని వ్యక్తం చేశారు. మా వాన కొండయ్య గుట్ట మా విశ్వాసానికి ప్రతీక దేవుడి గుట్టను మైనింగ్ మాఫియా పాలు కానివ్వం అని కూలీలు హెచ్చరించారు.

## జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సమీక్ష




**విశాలభారతి, న్యూ ఢిల్లీ:** సమీక్షా సమావేశానికి ముందు, హెచ్పిసిఎల్ యొక్క ఎస్ సి /ఎస్ టి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో యన్సిఎస్సి ప్రతినిధి బృందం విడిగా సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసోసియేషన్ లేవనెత్తిన సమస్యలను సమీక్షా సమావేశంలో హెచ్పిసిఎల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తామని కమిషన్ వారికి హామీ ఇచ్చింది. ఈ సమీక్షా సమావేశంలో పలు ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించారు. ఇందులో ముఖ్యంగా నియామకాలు, పదోన్నతులలో రిజర్వేషన్ విధానాన్ని అమలు చేయడం, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ చర్యలు, అలాగే స్వయం ఉపాధి, ఆదాయ వనరుల పెంపుదల మరియు షెడ్యూల్డ్ కులాల సామాజికఆర్థిక అభివృద్ధికి సంబంధించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాలపై చర్చించారు. వీటితో పాటు, ఎస్సీ కమ్యూనిటీకి మరింత ఆర్థిక సాధికారత మరియు సమగ్ర వృద్ధిని నిర్ధారించడానికి... ఎల్పిజీ డిస్ట్రిబ్యూటర్‌షిప్‌లు, పెట్రోల్ పంప్ డీలర్‌షిప్‌లు మరియు సిఎన్జి అవుట్‌లెట్ డీలర్‌షిప్‌లతో సహా హెచ్పిసిఎల్ డీలర్‌షిప్ కేటాయింపులలో షెడ్యూల్డ్ కులాల భాగస్వామ్యాన్ని పెంచడంపై కూడా చర్చలు జరిగాయి..ఈ సమావేశంలో యన్సిఎస్సి సెక్రటరీ గుడే శ్రీనివాస్‌తో పాటు కమిషన్‌కు చెందిన ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. హెచ్పిసిఎల్ తరపున చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ వికాస్ కౌశల్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

## ఘనంగా 'హెరిటేజ్ వాక్' నిర్వహణ




**ఆదిలాబాద్ , విశాలభారతి:** "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ సిరిచెల్మ ఆలయంలో 'హెరిటేజ్ వాక్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ బంగారిగూడ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆలయ చారిత్రక, సాంస్కృతిక విశిష్టతను తెలుసుకున్నారు. స్థానిక వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విద్యార్థుల్లో పర్యాటక ప్రదేశాలపై అవగాహన పెంపొందించేందుకు ఈ హెరిటేజ్ వాక్ నిర్వహించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సిరిచెల్మ ఆలయ చరిత్ర, స్థానిక సంస్కృతి, పర్యాటక ప్రాధాన్యతతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రవికుమార్, కేజీబీవీ ఉపాధ్యాయులు, ఆలయ కమిటీ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## 'ఏడు జ్యోతిర్లింగాల' పుణ్యక్షేత్ర దర్శన ప్రత్యేక బస్సు యాత్ర




**విశాలభారతి, గోదావరిఖని:** పవిత్ర క్షేత్రాల దర్శనం కోసం ఎదురుచూస్తున్న భక్తులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గోదావరిఖని డిపో ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక అవకాశాన్ని కల్పిస్తోంది. డిపో నుండి ఏడు జ్యోతిర్లింగాల పుణ్యక్షేత్ర యాత్ర కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యం .నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రత్యేక బస్సు యాత్ర 03.06.2026 వ తేదీన మధ్యాహ్నం 1:00 గంటకు గోదావరిఖని డిపో నుండి ప్రారంభమవుతుంది. మొత్తం 10 రోజుల పాటు (9 రాత్రులు) సాగే ఈ యాత్రలో దేశంలోని ప్రసిద్ధ ఏడు జ్యోతిర్లింగాలను భక్తులు సందర్శించుకోవచ్చు.సందర్శించే పుణ్యక్షేత్రాలు,ఓంకారేశ్వర్ ఉజ్జయిని,నాగేశ్వర,సోమనాథ్, త్రయంబక్,భీమశంకర్,గృష్ణేశ్వర్,ప్రయాణ ఛార్జీలు.రాజధాని ఏసీ బస్సు రూ. 12,000/ (ఒక్కొక్కరికి)సూపర్ లగ్జరీ బస్సు రూ. 10,000/ (ఒక్కొక్కరికి)ఈ యాత్రలో ప్రయాణికులకు భోజన మరియు వసతి సౌకర్యాల ఖర్చులను ప్రయాణికులే స్వయంగా భరించవలసి ఉంటుంది. ఆసక్తి కలిగిన భక్తులు తమ సీట్లను ముందస్తుగా రిజర్వ్ చేసుకోవాలని కోరడమైనది. ఈ ఆధ్యాత్మిక యాత్రకు సంబంధించిన పూర్తి వివరాల కోసం క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు ఫోన్ నంబర్: 7013504982 వాట్సాప్ (WhatsApp): 7382847596

## డాగ్ స్క్వాడ్‌తో కలిసి ప్రత్యేక చెకింగ్ నిర్వహించిన పోలీసులు



**విశాలభారతి, రామగుండం:** రామగుండం పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణలో భాగంగా రామగుండం సీఐ కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది,డాగ్ స్క్వాడ్ బృందం కలిసి ప్రత్యేక ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలు రామగుండం మజీద్ టర్నింగ్ ప్రాంతం, స్మోకింగ్ జోన్లు,పాన్ షాపులు మరియు ప్రజలు ఎక్కువగా గుమిగూడే ప్రాంతాల్లో చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పరిశీలించడంతో పాటు అక్కడి పరిస్థితులను పోలీసులు తనిఖీ చేశారు.తనిఖీల సందర్భంగా పోలీసులు స్థానిక ప్రజలతో మాట్లాడి ఈ చెకింగ్ నిర్వహించడానికి గల కారణాలను వివరించారు.ప్రజల భద్రత కోసం, నేరాలను ముందుగానే అరికట్టేందుకు ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా,ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.రామగుండం ప్రాంతంలో ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, నేరాలకు అవకాశం లేకుండా చేయడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం ఎస్సై వెంకట్ ,నార్కోటిక్ టీం,డాగ్ స్క్వాడ్ సిబ్బంది మరియు స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## రోహిన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

**తెలిపిన గజ్జి భాస్కర్ యాదవ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** అంబర్‌పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రోహిన్ రెడ్డి జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యాదవ్ సహకార కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రోహిన్ రెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.



డ్రైనేజ్ పనులను అసంపూర్తిగా వదిలేసిన దృశ్యం

# హైదర్ నగర్‌లో కలుషిత నీరు, జలమండలి నిర్లక్ష్యం బట్టబయలు

## పాలకులకు, అధికారులకు పట్టదా? .. ప్రశ్నిస్తున్న ప్రజా సంఘాలు



హనుమాన్ టెంపుల్ రోడ్డు చౌరస్తా వద్ద



పైప్ లైన్ లీకేజీతో కలుషితమవుతున్న మంచినీరు



నందమూరి నగర్‌లో కుళాయి నుంచి వస్తున్న కలుషిత నీరు

**హైదర్‌నగర్,విశాల భారతి**

హైదర్‌నగర్ డివిజన్‌లో జలమండలి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బస్తీల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ పూర్తిగా కుళ్లిపోయింది. మురుగునీరు తాగునీటి పైపుల్లో కలిసి కుళాయిల నుంచి నల్లగా, కంపుకొడుతూ వస్తున్నా అధికారులకు చీమ కుట్టినట్టైనా లేదు. నందమూరి నగర్, హైదర్‌నగర్ బస్తీవాసులు తాగునీటి కోసం కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ విషపు నీటితో చిన్నపిల్లలు, వృద్ధులు రోజూ ఆస్పత్రుల పాలవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారుల కళ్లు మాత్రం తెరుచుకోవడం లేదు.

**గేటెడ్ కమ్యూనిటీలకు గులాం, బస్తీలకు సలాం అంటున్న ఈశ్వర్**

"నందమూరి నగర్, హైదర్‌నగర్ బస్తీలంటేనే లైన్‌మెన్‌కు చులకన. ముడుపులు ఇచ్చే ధనవంతులకు ట్యాంకర్ల కొద్దీ నీరు, పూర్తి ప్రెషర్‌తో ఇస్తూ, పేదల గొంతును మాత్రం తడారేలా చేస్తున్నాడు" అని బస్తీవాసులు నిప్పులు చెరుగుతున్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు గులాంలా వంగి వంగి సలాం చేస్తున్న లైన్‌మెన్ ఈశ్వర్, బస్తీలకు మాత్రం సలాం కొట్టి మొండి చేయి చూపుతున్నాడని, ఈ తారతమ్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందని మండిపడుతున్నారు.

**"అంతా ఈశ్వరేచ్ఛా..." నీటి దోపిడీకి అడ్డే లేదా?***

తలపై గంగను ఆ ఈశ్వరుడు దాచుకున్నట్లు హైదర్‌నగర్ లైన్‌మెన్ ఈశ్వర్ సైతం గంగను తన గుప్పెట్లో బంధించి కావలసిన వాళ్లకు, ముడుపులు ముట్ట చెప్పిన్న వారికి అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా నీటిని వదులుతూ బస్తీలకు గుక్కెడు నీళ్ల దాహం కూడా తీర్చలేని కఠినాత్ముడుగా మారాడని స్థానికులు నిలదీస్తున్నారు. ఈశ్వర్ ఇష్టారాజ్యం కొనసాగుతున్నా సెక్షన్ మేనేజర్ విలియం ప్రకాశ్, డీజీఎం శ్రీనివాసరాజు, జీఎం హరిశంకర్‌లు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు అతనికి అండదండలు అందిస్తూ, వెన్నుదన్నుగా నిలుస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల ఈ ఉమ్మడి నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 'ఎవరి వాటా వారికి' కచ్చితంగా ముట్టచెప్పడంలో ఈశ్వర్ దిట్ట అని బస్తీల్లో టాక్. స్వయానా జలమండలి ఉద్యోగే ఈశ్వర్‌పై నోరు విప్పడం అధికారుల వైఫల్యానికి పరాకాష్ఠ. "ఒకే శాఖలో పనిచేస్తున్నా, మా బస్తీ గోడు వినే నాథుడే లేడు. పేదలంటే ఇంత చిన్నచూపా? ప్రజాప్రతినిధులు ఎక్కడ దాక్కున్నారు?" అని ఆ ఉద్యోగి నిస్సహాయంగా ప్రశ్నిస్తున్నాడు.

***అసంపూర్తి మరమ్మతులే శాపం, అధికారులకు మాత్రం వరం***

లీకేజీల పేరుతో రోడ్లు తవ్వి, పనులు అర్ధంతరంగా వదిలేయడం అధికారులకు అలవాటుగా మారింది. గుంతలు తీసి పైపులైన్లను బయటకు వదిలేసి, వాటిలో మురికి నీరు చేరేలా చేస్తున్నారు. దీంతో తాగునీరు నేరుగా కలుషితమవుతోంది. మ్యాన్‌హోళ్ల చుట్టూ శిథిలాలు, చెత్త కుప్పలుగా పేరుకుపోయినా పట్టించుకునే నాథుడే లేడు. రిపేర్ల పేరుతో ప్రజాధనం దోచుకుంటూ, పైపులను సరిగ్గా బిగించకుండా మట్టితో కప్పేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో మురికి నీరు యథావిధిగా తాగునీటిలో కలిసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

**ప్రజాప్రతినిధులు ఎక్కడ?**

బస్తీల గొంతెండి పోతున్నా స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే సహా ఒక్క ప్రజాప్రతినిధీ తొంగిచూసిన పాపాన పోలేదు. ఓట్లప్పుడు బస్తీల చుట్టూ ప్రదక్షిణలు చేసి 'ప్రజా పనులు' చేస్తామని గొప్పలు చెప్పిన నాయకులు ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారని బస్తీవాసులు నిలదీస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఈ కుమ్మక్కు, నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని లైన్‌మెన్ ఈశ్వర్‌పై, అతనికి అండగా నిలుస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, రోడ్లపైకి వచ్చి తాడో పేడో తేల్చుకుంటామని బస్తీవాసులు, ప్రజా సంఘాలు తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తున్నాయి.

### 45 నిమిషాల నీళ్లు కూడా భారమా?

వేసవి మండుతున్నా రోజుకు కనీసం 45 నిమిషాలు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలని బస్తీవాసులు మొత్తుకుంటున్నా కనికరించే వారే లేరు. లో ప్రెషర్‌తో కలుషిత నీటిని వదిలి చేతులు దులుపుకుంటున్నాడు లైన్‌మెన్. మంచినీరు ప్రజల ప్రాథమిక హక్కు అయినా, బస్తీలపై జలమండలి, పాలకులు కక్షగట్టినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు భగ్గుమంటున్నారు.

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన కాంట్రాక్టర్ల జేఏసీ

**మహబూబాబాద్ విశాలభారతి:**

తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల జేఏసీ సభ్యులు మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ ను వారి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కాంట్రాక్టర్ల సమస్యలను వివరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 17ను వెంటనే రద్దు చేయాలని, కాంట్రాక్టర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జేఏసీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కాంట్రాక్టర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు, పాలు మరియు ఇతర ఆహార పదార్థాల సరఫరాలో పారదర్శక విధానాలు అమలు చేసి అర్హులైన కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించిందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లు మరియు ఇతర సరుకుల సరఫరా టెండర్లలో నిబంధనలు మార్చి అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరికి లబ్ధి చేకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. చిన్న మరియు మధ్య తరహా కాంట్రాక్టర్లకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తమ ప్రధాన డిమాండ్లుగా జీవో నంబర్ 17 రద్దు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు న్యాయం, చేవెళ్ల మరియు కామారెడ్డి డిక్లరేషన్ అమలు, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, తెలంగాణ కాంట్రాక్టులను



తెలంగాణకు చెందిన వారికే కేటాయించడం, ఎంఎస్ ఎం ఈ, మరియు కుటీర పరిశ్రమలకు ప్రాధాన్యత, ఈఎండి మరియు ఎస్ డి మినహాయింపులు, టెండర్ నిబంధనల సరళీకరణ, పెండింగ్ బిల్లుల విడుదల వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ సమస్యలను బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి, పార్టీ తరపున కాంట్రాక్టర్ల హక్కుల సాధనకు కృషి చేస్తామని సత్యవతి రాథోడ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కే శ్రీనివాసరావు, సీహెచ్ సత్యనారాయణ, ఈ వెంకటేశ్వర్లు, బి. గోపాల్, ఎండీ అఫ్జల్, జి శ్రీధర్, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**విశాలభారతి, గోదావరిఖని:**



రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మోటరైజ్డ్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 20 మంది లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఉచిత వాహనాల పంపిణీ ద్వారా దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వారి స్వావలంబనకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు.ప్రతి కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కూడా సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. దివ్యాంగుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా నిరంతరం కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. వాహనాలు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధిపై సమీక్షసమావేశం

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**విశాలభారతి గోదావరిఖని:** రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారంపెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ సింగరేణి, మున్సిపల్, పంచాయతీ రాజ్ మరియు ఇతర ఉన్నత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం మరియు మౌలిక వసతుల మెరుగుదల లక్ష్యంగా నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా వ్యవస్థ, రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ సౌకర్యాలు మరియు ప్రజలకు అవసరమైన ఇతర ప్రాథమిక వసతులపై అధికారులతో ఎమ్మెల్యే విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో చేరేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి, సౌకర్యాలు మరియు పరిపాలనలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు.

## అస్తవ్యస్తంగా బూర్గంపాడు "హస్తం" నాయకత్వం

- ఎవరికి వారే యమునా తీరే .. కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ నాయకులే ప్రతిపక్షం
- ప్రజాప్రతినిధులకు చెవులో జోరీగాల వర్గపోరు

**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు హస్తం "నాయకత్వం" సరైన నాయకుడు లేక అగమ్యగోచరంగా మారింది. నేతల తీరు "ఎవరికి వారే యమనాతీరే" అధికారం,ఆధిపత్యం పెత్తనం కోసం పార్టీలో వర్గాలుగా ఏర్పడి ప్రజాపతినిధులకు చెవులో జోరీగా లాగా మారరు. సమర్థవంతమైన నాయకుడి కోసం ఎదురుచూస్తున్న స్థానిక ప్రజలు. కాంగ్రెస్ కు కాంగ్రెస్ నాయకులే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నాయని వామపక్షాలు ఎద్దేవా చేస్తున్నాయి. ఏమి పట్టనట్టు గోడ మీద కూర్చొని చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు,పిచ్చోడి చేతిలో రాయిలా బూర్గంపాడ్ పార్టీ పగ్గాలు. మండల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో భరోసా కరువైంది. వర్గ పోరు రోజురోజుకు తారస్థాయికి చేరడంతో ఎక్కడ ఏసిన గొంగడి అక్కడే అనేలా ప్రజా సమస్యలను పరిష్కరించవలసిన నాయకులు ప్రజా ప్రతినిధుల దగ్గర పంచాయతీలతో కాలయాపన ఒకపక్క రాష్ట్ర ప్రభుత్వం ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు కసరత్తులు చేస్తుంటే బూర్గంపాడు కాంగ్రెస్ నేతల పనితీరు ప్రతిపక్షాలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇది ఇలా ఉంటే ప్రజా ప్రతినిధుల మౌనం పాటించడం సరి కాదని, స్థానిక ఎమ్మెల్యే లేదా మంత్రి జోక్యం చేసుకొని వర్గ పోరు ఆధిపత్యం కోసం పోట్లాడుతున్న బూర్గంపాడు నేతలను చక్కబెట్టాలని ఈ సందర్భంగా మండల ప్రజలు కోరుతున్నారు.



# ఆధునిక భారతానికి రాచబాట వేసిన రాజీవ్

దేశ రాజకీయాల్లో కొంతమంది నాయకులు అధికారంలో ఉన్న కాలానికే పరిమితమై పోతారు. కానీ కొందరు నాయకులు మాత్రం దేశ భవిష్యత్తును మార్చే నిర్ణయాలతో చరిత్రలో నిలిచిపోతారు. అలాంటి అరుదైన నాయకుల్లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఒకరు. అతి చిన్న వయసులో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన... భారతదేశాన్ని 21వ శతాబ్దం వైపు నడిపించాలన్న స్పష్టమైన ఆలోచనతో పనిచేశారు. నేడు మన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్, డిజిటల్ సేవలు, ఐటీ రంగ విస్తరణ... ఇవన్నీ ఒక్కరోజులో వచ్చిన మార్పులు కావు. వాటి వెనుక రాజీవ్ గాంధీ దూరదృష్టి ఉంది. దేశానికి కంప్యూటర్ యుగాన్ని పరిచయం చేసిన నాయకుడు ఆయనే. అప్పట్లో కంప్యూటర్లపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఉద్యోగాలు పోతాయని కొందరు భయపడ్డారు. కానీ భవిష్యత్తు టెక్నాలజీదేనని రాజీవ్ ముందే గుర్తించారు. అదే నేడు భారత్‌ను ప్రపంచ ఐటీ శక్తిగా నిలబెట్టింది. టెలికాం రంగంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశాన్ని పూర్తిగా మార్చేశాయి. గ్రామాల్లో కూడా ఫోన్ సేవలు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో పీసీవో వ్యవస్థను తీసుకొచ్చారు. కమ్యూనికేషన్ రంగాన్ని సామాన్యుడికి చేరువ చేశారు. నేడు దేశం డిజిటల్ విప్లవం గురించి మాట్లాడుతుంటే... దానికి పునాది రాజీవ్ గాంధీయే వేసినట్టు చెప్పాలి.



యువతపై ఆయనకు ఉన్న నమ్మకం ప్రత్యేకం. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతను దేశ రాజకీయాల్లో భాగస్వామ్యం చేశారు. అది సాధారణ నిర్ణయం కాదు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్న విశ్వాసానికి అది నిదర్శనం. గ్రామీణాభివృద్ధికి కూడా ఆయన పెద్దపీట వేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేశారు. స్థానిక సంస్థలకు అధికారాలు ఇవ్వాలన్న ఆలోచనతో ముందుకు సాగారు. గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలపర్చాలన్నది ఆయన లక్ష్యం. విద్యా రంగంలో కూడా ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. నవోదయ విద్యాలయాలు, ఓపెన్ యూనివర్సిటీలు వంటి నిర్ణయాలు గ్రామీణ, పేద విద్యార్థులకు కొత్త అవకాశాలు తెరిచాయి. విద్య అందరికీ చేరాలన్న ఆలోచనతో ఆయన ఎన్నో సంస్కరణలు చేపట్టారు. రాజకీయాల్లో "మిస్టర్ క్లీన్"గా పేరొందిన రాజీవ్ గాంధీపై ఎన్నో ఆరోపణలు వచ్చినా... కాలం గడిచేకొద్దీ ఆయనపై ప్రజల్లో గౌరవం మరింత పెరిగింది. దేశ సమగ్రత కోసం, అభివృద్ధి కోసం పనిచేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. 1991లో ఉగ్రవాద దాడిలో ఆయన మరణం దేశానికి తీరని లోటు. కానీ ఆయన చూపిన మార్గం మాత్రం ఇంకా దేశాన్ని నడిపిస్తూనే ఉంది. నేడు భారత్ టెక్నాలజీ, ఐటీ, డిజిటల్ రంగాల్లో ప్రపంచానికి పోటీ ఇస్తుంటే... అందులో రాజీవ్ గాంధీ దూరదృష్టి కూడా ఒక ముఖ్య కారణమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



సాగర్ వనపర్తి, సీనియర్ జర్నలిస్టు,
9100004402


## క్రీడల్లో ప్రతిభ చాటిన పినపాక విద్యార్థిని

**మినీ గురుకులం పినపాక విద్యార్థిని స్పోర్ట్స్ స్కూల్ హన్మకొండకు ఎంపిక**



**విశాలభారతి :** కరకాగూడెం పినపాక మండలం లోని స్థానిక మినీ గురుకులం బాలికలు పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని మర్మం వైష్ణవి, తండ్రి వెంకటేష్, విద్యార్థిని తన అసాధారణ ప్రతిభతో స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి చూపుతూ వివిధ ఆటల పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన ఆమెను అధికారులు నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణురాలిగా ప్రకటించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం అధికారులు ఆమెను వారి తల్లితండ్రులను శాలువాతో సత్కరించి అభినందించారు. పాఠశాలలో క్రీడలకు ఇస్తున్న ప్రోత్సాహం వల్లే విద్యార్థిని రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో అధికారులు శ్రీమతి బి. అరుణకుమారి, ఆర్.సీ.ఓ ఖమ్మం, ఏ.ఓ కే. నరేందర్ గురుకులం సెల్, ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎం. శకుంతల, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీ మహేశ్వరి, ఉపాధ్యాయ సిబ్బంది. విద్యార్థినిని, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలల ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం



**మహబూబాబాద్ విశాలభారతి:** 20262027 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన SC, ST, BC, EBC, మైనారిటీ మరియు దివ్యాంగ విద్యార్థులకు అత్యుత్తమ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మార్చి 2026లో పదో తరగతి పరీక్షల్లో 7.0 జీపీఏ లేదా అంతకంటే ఎక్కువ గ్రేడ్ సాధించిన విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కస్తూరిబా పాఠశాలలు, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన డే స్కాలర్లు, ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, జవహర్ నవోదయ విద్యాలయాలు మరియు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం SC/STలకు రూ.2 లక్షలు, BC/EBC/మైనారిటీ విద్యార్థులకు రూ.1 లక్ష మించరాదని తెలిపారు. విద్యార్థులు మే 21 నుంచి జూన్ 5, 2026 వరకు ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తుతో పాటు 10వ తరగతి పాస్ మెమో, కులం మరియు ఆదాయ ధృవీకరణ పత్రాలు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరచాలని సూచించారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు మూడు సంవత్సరాల బోనాఫైడ్ ధృవీకరణ పత్రాన్ని కూడా సమర్పించాలన్నారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు ప్రాధాన్యత క్రమంలో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యిన అనంతరం ఈపాస్ సిస్టమ్ ద్వారా ఆటోమేటిక్‌గా విద్యార్థుల ఎంపిక మరియు కళాశాలల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు.

## ఎస్ఎన్డీపీ కి లైన్ క్లియర్

**ఎంఎంసీ నుండి నిధులు మంజూరు**

**మేడిపల్లి విశాలభారతి:** గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఎస్ఎన్డీపీ పనులకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయ్యింది.బోడుప్పల్ మాజీ మేయర్ చొరవతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానం చేయించి నిధులను మంజూరు చేయాడంతో పనులు ప్రారంభం కానున్నాయి. బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డిని బోడుప్పల్ మాజీ మేయర్ బృందం కలిసింది.ఈ సందర్భంగా మాజీ మేయర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ గవర్నమెంట్ లో 110 కోట్లరూపాయలతో పనులు ప్రారంభం అంటూ హడావుడి చేశారే కానీ పనులకు అతిగతి లేకుండా పోయింది.దీంతో పనులు ఎక్కడికక్కడ అగిపోయాయి.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అజయ్ యాదవ్ పట్టుపట్టి మరీ ఈ నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ సర్కిల్ ప్రజలకు వర్షకాలంలో వరద బాధలు తీర్చేందుకు గాను ఎస్ఎన్డీపీ నిధులు మంజూరు చేయాడంలో సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి,జిల్లా ఇంచార్జ మంత్రి శ్రీధర్ బాబు ,ఎంఎంసీ కమిషనర్ ప్రత్యేక అధికారి వినయ కృష్ణ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి,బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సగం మందికే సగం రేటు గ్యాస్

- **895 రోజులైనా అమలుకాని హామీలు**
- **కాంగ్రెస్ పార్టీ రూ. 500 అని చెప్పిన గ్యాస్ డబ్బులు వెంటనే వేయాలి**
- **జొన్నలను ఎకరానికి 25 క్వింటాళ్లు కొనుగోలు చేయాలి**
- **సరిపడా గన్ని సంచులు అందజేయాలి**
- **బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్**



**ఆదిలాబాద్ , విశాలభారతి:**


అమలుకానీ హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ విమర్శించారు. ప్రభుత్వం వచ్చాక రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పిన ప్రభుత్వం సగం మందికే సగం రేటు గ్యాస్ అందిస్తుందని మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ. 1050 చెల్లించి గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేస్తున్న అనేకమంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తామని చెప్పిన రూ. 500 ఖాతాల్లో రావడం లేదని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సగం మందికే డబ్బులు జమ చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికే 3 విడతల రైతుబంధు ఎగ్గొట్టిన నెలకు ఒక ఎకరానికి వేస్తూ టైం పాస్ చేస్తుందని మజర్ పేర్కొన్నారు. ప్రజా పాలన అంటే సగం మందికి సగం రేటు, ప్రజా పాలన అంటే మహిళకు ఫ్రీ టికెట్, మగవారికి డబుల్ టికెట్, ప్రజా పాలన అంటే కట్టిన ఇండ్లు కూల్చడం, ప్రజా పాలన అంటే 3 సంవత్సరాలు అయిన ఎమ్మెల్యేలకు CDP నిధులు కేటాయించక పోవడం, ప్రజా పాలన అంటే ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, ప్రజా పాలన అంటే పేదలకు ఒక న్యాయం పెద్దలకు ఒక న్యాయం ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా 100 రోజుల్లో అమలు అని చెప్పిన మాట అవాస్తవమని నమ్మి 895 రోజులైనా హామీలు అమలుకాలేదని ప్రజలకు గ్యాస్ డబ్బులు, రైతులకు రైతుబంధు డబ్బులు వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి దత్తత జిల్లాగా పేరు ఉన్న ఆదిలాబాద్ కు పేరు తప్ప పని ఏమి జరగలేదని అన్నారు. అసెంబ్లీలో 3 బడ్జెట్ సమావేశాలు పూర్తయిన దత్తత ఆదిలాబాద్ జిల్లాకు మూడు పైసలు కూడా కేటాయించని ముఖ్యమంత్రితో ఆదిలాబాద్ జిల్లాకు న్యాయమా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను 100 రోజుల్లో అమలుచేసి ఉంటే ప్రజా పాలన అయ్యేదని ఇప్పుడు ఈ పాలన పనికిమాలిన పాలన అని అన్నారు. జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దత్తత జిల్లా ఆదిలాబాద్ కు ప్రత్యేక నిధులు మరియు ఇంజినీర్ కళాశాల, అయిర్పోర్టు, సీసీఐ పునప్రారంభానికి అనుమతులతోనే రావాలని డిమాండ్ చేశారు. కొడంగల్ డిక్లరేషన్ పేరిట రూ. 10,000 కోట్లు కొడంగల్ కు కేటాయించిన రేవంత్ రెడ్డి, వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు రూ. 5,000 కోట్లు మంజూరు పత్రంతోనే ఆదిలాబాద్ జిల్లాకు రావాలని డిమాండ్ చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎకరానికి 25 క్వింటాళ్లు జొన్నలు కొనాలని డిమాండ్ చేసింది, కానీ నేడు అధికారంలో ఉండి ఎకరానికి 10 క్వింటాళ్లే కొనడం సిగ్గు చేటు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఒక మాట మాట్లాడుతూ అధికారం కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది. గన్ని సంచులు లేక రైతులు మార్కెట్ యార్డుల్లో, కొనుగోలు కేంద్రాల్లో వర్షంలో ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కనీసం కొనే పంటలకు గన్ని సంచులు అందించలేకపోతుందని అన్నారు.

## విడాకుల తర్వాత వేధింపులు

- **పోలీసులకు ఫిర్యాదు చేసిన రోహిత్ యాదవ్**
- **మాజీ భార్య, బంధువుల దౌర్జన్యంపై చందానగర్ పోలీసులకు ఫిర్యాదు**

**సైబరాబాద్ - విశాల భారతి**

మాజీ భార్య మహాలక్ష్మి, ఆమె బంధువులు తనపై దాడికి పాల్పడ్డారని, అసత్య ఆరోపణలతో వేధిస్తున్నారని రోహిత్ యాదవ్ ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన తనకు జరిగిన అన్యాయాన్ని మీడియాకు క్లుప్తంగా వివరించారు. తనకు జరిగిన నష్టాన్ని వివరంగా తెలిపారు. మహాలక్ష్మి ప్రవర్తన సరిగా లేకనే 2025 డిసెంబర్‌లో విడాకులు ఇచ్చానని రోహిత్ పేర్కొన్నారు. మహాలక్ష్మి ఓ బాబుకు జన్మనిచ్చిన విషయం కూడా భర్తగా తనకు చెప్పకుండా దాచిపెట్టిందని, వేరే ఎవరో చెప్తే గాని నాకు తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె మరొకరితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ చాటింగ్ చేస్తున్నట్లు గుర్తించానని, ఎన్నిసార్లు చెప్పినా ప్రవర్తన మార్చుకోలేదని తెలిపారు. విడాకుల తర్వాత కూడా మే 17వ తేదీన దాదాపు 30 మందితో కలిసి మహాలక్ష్మి తన ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారని, తనపై దాడికి దిగారని ఆరోపించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, తన వద్ద ఉన్న అన్ని ఆధారాలు, విడాకుల కాపీని పోలీసులకు అందజేశానని వెల్లడించారు. ఆమెతో పాటు ఆమె బంధువుల నుంచి తమకు ప్రాణహాని ఉందని, ఏదైనా జరిగితే వారే బాధ్యులని పోలీసులకు తెలిపినట్లు చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు మమ్మల్ని సంప్రదించకుండానే అవాస్తవాలను చిత్రీకరించడం, వాటిని కథనాలుగా ప్రసారం చేయడం మమ్మల్ని, మా కుటుంబ సభ్యుల్ని తీవ్రంగా కలచివేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలు తెలుసుకొని మీడియా సంస్థలు, ఛానళ్లు బాధితులకు న్యాయం చేయాలని, అసత్య ప్రచారాలు సబబు కాదని, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు విజ్ఞప్తి చేశారు.తనపై అనవసర ఆరోపణలు చేసి తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని రోహిత్ పేర్కొన్నారు. మహాలక్ష్మితో పాటు ఆమె బంధువులపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.



**మహాలక్ష్మికి తనకు మంజూరైన విడాకుల పత్రాన్ని మీడియాకు చూపిస్తున్న రోహిత్ యాదవ్.**

## జెప్టో డెలివరీ ముసుగు

- **బైకుల చోరీకి తెరలేపిన అన్నదమ్ములు**
- **రూ.10 లక్షల వాహనాలు స్వాధీనం**

**ఏసీపీ గంగిరెడ్డి వివరాలు వెల్లడి**



**మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఏసిపి గంగిరెడ్డి,సిఐ సతీష్ కుమార్**

**సైబరాబాద్, విశాలభారతి:** కుత్బుల్లాపర్ జోన్‌లోని బాచుపల్లి పరిధిలో ద్విచక్ర వాహనా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాలో ఇద్దరు సోదరులు (ప్రధాన నిందితులు) ముగ్గురు బాల నేరస్థులు ఉన్నారు. వారి నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 10 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అందుకు సంబందించిన వివరాలను కుత్బుల్లాపూర్ ఏసీపీ గంగిరెడ్డి ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ డీఐ సురేష్‌లు వెల్లడించారు ..ఈ ఇద్దరు సోదరులు జెప్టో డెలివరీ బాయ్స్‌గా పని చేస్తూ ఉండేవారు. మద్యం, చెడు అలవాట్లకు బానిసలై డబ్బు అవసరం కోసం బైక్ దొంగతనాలకు పాల్పడ్డారు. వారు ముగ్గురు బాల నేరస్థులను ఉపయోగించి నగరంలోని వివిధ ప్రాంతాల్లో బైకులు దొంగిలించేవారు. దొంగిలించిన బైకులను పెట్రోలు అయ్యే వరకు తిప్పి, ఆ తర్వాత వివిధ ప్రాంతాల్లో వదిలేసేవారని తెలిపారు. పోలీసులు ఇటీవలి కాలంలో నగరంలో బైక్ దొంగతనాల కేసులు పెరగడంతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. ఈ నిఘా ఫలితంగానే ఈ ముఠా పట్టుబడింది. నిందితులు డెలివరీ ఉద్యోగులుగా ఉండడం, వారి చెడు అలవాట్లు ఇలాంటి నేరాలకు దారి తీశాయని పోలీసులు ఆరోపిస్తున్నారు.ఈ అరెస్టు హైదరాబాద్‌లో గిగ్ ఉద్యోగులు (డెలివరీ బాయ్స్) మధ్య కొందరు చెడు మార్గాలు ఎంచుకుంటున్న సమస్యను మళ్లీ బయటపెట్టింది. పోలీసులు ప్రజలను వాహనాలను సురక్షితంగా పార్క్ చేయాలని,లాక్స్ వాడాలని సూచిస్తున్నారు.

## ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- **ముత్తంగి వార్డులో పర్యటించిన శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్**



**ముత్తంగిలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ నారాయణ అమిత్**

**సైబరాబాద్, విశాల భారతి:** పటాన్‌చెరు సర్కిల్ పరిధి ముత్తంగి వార్డును శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ (ఐఏఎస్) బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కంధనూర్, ఘన్పూర్, వెల్మల్ గ్రామాల్లో పారిశుధ్య పనులు, బోర్‌వెల్ సమస్యలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు.గ్రామాల్లో చెత్త సేకరణ, మురుగు కాలువల శుభ్రత, తాగునీటి సరఫరా వ్యవస్థలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బోర్‌వెల్‌లు పనిచేయకపోవడం, నీటి ఎద్దడిపై స్థానికుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ, "పారిశుధ్య నిర్వహణలో లోపాలు ఉండకూడదు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలి" అని స్పష్టం చేశారు. బోర్‌వెల్‌ల మరమ్మతులు, కొత్త బోర్‌వెల్‌ల ఏర్పాటు, మురుగునీటి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పౌరుల సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, మురుగునీరు వంటి మౌలిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, సర్కిల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

## అపస్మారక స్థితిలో వ్యక్తి

- **జీడిమెట్ల పోలీసుల సత్వర స్పందన**
- **నిండు ప్రాణం కాపాడిన పోలీసులు**
- **కుటుంబ సభ్యుల ధన్యవాదాలు**



**అపస్మానిక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చిన పోలీసులు**

**సైబరాబాద్ విశాల భారతి:** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీ రోడ్డు పక్కన బుధవారం మధ్యాహ్నం 1:30 గంటలకు అపస్మారక స్థితిలో ఒక వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీస్ సిబ్బంది క్షణం ఆలస్యం చేయకుండా 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వ్యక్తి వివరాలు తెలియకపోవడంతో అంబులెన్స్ సిబ్బంది సలహా మేరకు పోలీసులు అతడిని హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, ఎక్స్‌రే పరీక్షలు వెంటనే చేయించి వైద్యం అందేలా చూశారు. బాధితుడి ఆచూకీ కోసం పోలీసులు సమయస్ఫూర్తి ప్రదర్శించారు. అతడి ఫొటోను సోషల్ మీడియాలో, జీడిమెట్ల సిటిజన్స్ గ్రూప్‌తో పాటు పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. పోలీసుల ఈ చొరవ ఫలితంగా గంట వ్యవధిలోనే సమాచారం కుటుంబ సభ్యులకు చేరింది.కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి చేరుకొని పోలీసులతో కలిసి మెరుగైన వైద్యం కోసం బాధితుడిని ఇంక్యుబేషన్‌లో చేర్పించారు. తక్షణం స్పందించి తమ వారి నిండు ప్రాణాన్ని కాపాడిన జీడిమెట్ల పోలీస్ సిబ్బంది సేవాతత్పరత, మానవత్వంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. "పోలీసులు దేవుడిలా ఆదుకున్నారు. వారి బాధ్యత, స్పందనకు సెల్యూట్ చేస్తున్నాం" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సకాల స్పందనను స్థానికులు సైతం అభినందిస్తున్నారు.

## త్రాగు నీటి ఎద్దడి నివారించండి

**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి :** బౌద్ధనగర్,రాఘవేంద్ర నగర్, అంబర్ నగర్, వారాసిగూడ బాల్వాడి స్కూల్, మార్కండేయ నగర్ తదితర బస్తీల్లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ పాదయాత్ర బుధవారం నిర్వహించారు.స్థానిక ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా తీవ్ర ఇబ్బందికరంగా ఉందని, రోజుకు కొద్ది సమయం మాత్రమే మంచినీరు వస్తుండటంతో నీటి ఎద్దడి ఏర్పడిందని ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే ఈ సమస్యను జలమండలి జనరల్ మేనేజర్, స్థానిక మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి, నీటి సరఫరా సమయాన్ని పెంచాలని తెలిపారు. స్పందించిన అధికారులు త్వరలోనే సరఫరాను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారని ఆమె వివరించారు. పలు బస్తీల్లో వంగిపోయిన, తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాలను మార్చాలని గతంలోనే విద్యుత్ శాఖ సీఎండీకి వినతిపత్రం అందజేయగా, ఆ పనులకు అనుమతి లభించిందని తెలిపారు. త్వరలోనే పాత స్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని స్వరూప గౌడ్ పేర్కొన్నారు.పాదయాత్రలో పాల్గొన్నవారు రవి ప్రసాద్ గౌడ్, బిజెపి బౌద్ధ నగర్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ గౌడ్, బస్తీ అధ్యక్షుడు నాగరాజు, ప్రమోద్, వరలక్ష్మి, వెంకట చైతన్య, శ్రీశైలం, రాజు, ఓములు, జయంత్, మహేష్, విజయలాల్, పద్మారావు,కృష్ణయ్య స్వామి, నరేష్, శ్రీనివాస్, అశోక్, అనిత, లత, బిక్షపతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటలు గడిచినా స్పందించని విద్యుత్ శాఖ

**ఏఈ హాము నాయక్ నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్య ధోరణిపై స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాశింబౌలి గ్రామానికి చెందిన యువకుడు శివశాంత్ రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ఇప్పటివరకు తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో శివశాంత్ రెడ్డి కారులో వెళ్తుండగా జేబీఐటీ కళాశాల సమీపంలో 30 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో తీవ్ర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో యువకుడు మృతి చెందగా, విద్యుత్ స్తంభం పూర్తిగా దెబ్బతిని ప్రమాదకర స్థితిలో ఉందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే మొయినాబాద్ విద్యుత్ శాఖ ఏఈ హాము నాయక్ దృష్టికి తీసుకెళ్లినా 48 గంటలు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విధంగా గతంలో కూడా మొయినాబాద్ గ్రామంలో ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని గ్రామస్తులు ఏఈకు వినతిపత్రం అందజేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న సమస్యలపై విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శించడం దురదృష్టకరమని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మాధాపురం శ్రీకాంత్ మండిపడ్డారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించి వెంటనే స్పందించి ప్రమాదకర విద్యుత్ స్తంభాలు, తీగలను తొలగించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# నటనకు భాష ముఖ్యం

మరాఠీ మందారం భాగ్యశ్రీబోర్సేకి సరైన విజయాలు లేకపోయినా.. సరైన అవకాశాలు మాత్రం తలుపుతడుతూనేవున్నాయి. తమిళంలో శివకార్తికేయన్ కథానాయకుడిగా కమల్‌హాసన్ నిర్మిస్తున్న 'సెయాన్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికైన విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రంలోని తన పాత్ర గురించి భాగ్యశ్రీ బోర్సే మాట్లాడింది. 'ఈ సినిమాలోని నా పాత్ర గురించి ఇప్పుడే ఏం చెప్పలేను. అయితే.. ఈ కథలో నా పాత్ర కీలకమని మాత్రం చెప్పగలను. నన్ను ఉత్తమనటిగా ప్రేక్షకుల ముందు నిలబెట్టే పాత్ర ఇది.అందులో సందేహం లేదు. ఏదైనా పాత్ర చేస్తున్నప్పుడు ఆ పాత్రను పూర్తిగా అర్థం చేసుకోవాలంటే భాష చాలా ముఖ్యం. కథలోని భావోద్వేగాలను అర్థం చేసుకోకుండా నటిస్తే, అది నిరర్థకమే. అందుకే.. నిజాయితీగా ముందు భాష తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాను. తెలుగులో విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'కింగ్‌డమ్' సినిమా నటించేటప్పుడు నా పాత్ర కోసం తెలుగు నేర్చుకొని, డబ్బింగ్ కూడా నేనే చెప్పకున్నా. అదే విధంగా త్వరలో 'సెయాన్' కోసం తమిళం నేర్చుకొని, నా పాత్రకు నేనే డబ్బింగ్ చెబుతా' అని పేర్కొన్నది భాగ్యశ్రీ బోర్సే.

## కాంగ్రెస్ పార్టీని హెచ్చరించిన బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి

- ప్రధానమంత్రిని అవమానిస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్తూనే ఉన్నారు
- రాహుల్ గాంధీ మాట్లాడుతున్న తీరుపై ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు



**హైదరాబాద్‌విశాలభారతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీని పదే పదే దుర్భాషలాడటం, అవమానించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారింద నీ తెలంగాణ బిజెపి చీఫ్ స్పోక్‌స్పర్సన్ & మీడియా ఇన్‌ఛార్జ్ ఎన్.వి. సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీ జీని నమ్మక ద్రోహి, దేశద్రోహి అని సంబోధిస్తూ చేసిన తాజా అవమానకరమైన వ్యాఖ్య తీవ్రంగా ఖండిస్తున్నాను.బాధ్యతారాహిత్యమైనది మరియు సిగ్గుచేటు. పేద మరియు సాధారణ ఓబీసీ నేపథ్యం నుంచి వచ్చిన ఒక వ్యక్తి తన కష్టం, అంకితభావం, ప్రజా సేవ ద్వారా ఎదిగి రికార్డు స్థాయిలో వరుసగా మూడోసారి దేశ ప్రధాని కావడాన్ని కాంగ్రెస్ ప్రథమ కుటుంబం (గాంధీ కుటుంబం) ఏనాటికీ జీర్ణించుకోలేదన్న వారి మనస్తత్వానికి ఈ వ్యాఖ్య ప్రత్యక్ష నిదర్శనం.ఈనాటి ఈ దూషణ కొత్తేమీ కాదు. ఇన్నేళ్లలో కాంగ్రెస్ నాయకులు నరేంద్ర మోదీ జీని 90 సార్లకు పైగా అవమానించారు —— గుజరాత్‌లో ఆయన్ని "మౌత్ కా సౌదాగర్" అని పిలవడం దగ్గరి నుంచి పదే పదే అత్యంత అసభ్యకరమైన, అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం వరకు వారి తీరు మారలేదు. రాహుల్ గాంధీ చేసిన అసభ్యకరమైన, అభ్యంతరకరమైన మరియు సిగ్గుమాలిన వ్యాఖ్యను ఎంత ఖండించినా తక్కువే. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీలు తమ దురదృష్టకరమైన మరియు బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలకు భారీ రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదు. 99 ఎన్నికల్లో ఎదురైన వరుస పరాజయాల వల్ల తలెత్తిన నిరాశ, నిస్పృహలు ఇప్పుడు రాహుల్ గాంధీ మాటల్లో, ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజలచే పదేపదే తిరస్కరించబడిన పార్టీకి ఎలాంటి దార్శనికత, ఎజెండా, నిర్మాణాత్మక రాజకీయాలు లేకపోవడంతోనే ఇప్పుడు ఇలా వ్యక్తిగత దూషణలకు దిగుతోంది.

**రాహుల్ గాంధీ ఈ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి:** నక్సలిజాన్ని అంతం చేయడం దేశద్రోహమా?..దేశ సరిహద్దులను భద్రపరచడం, భారత భూభాగాన్ని రక్షించడం దేశద్రోహమా...?ప్రపంచవ్యాప్తంగా భారత త్రివర్ణ పతాక గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేయడం దేశద్రోహమా..?పేదలు, రైతులు, యువత, మహిళలు, అణగారిన వర్గాల కోసం పనిచేయడం దేశద్రోహమా? గత 12 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గ్రామాలు, పేదలు, రైతులు, కార్మికులు, పీడిత మరియు అణగారిన వర్గాల సంక్షేమం కోసం చారిత్రాత్మక కార్యక్రమాలను చేపట్టారు. అందుకే 140 కోట్ల మంది భారతీయులు ఆయన నాయకత్వంపై తమ విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఉంచుతూనే ఉన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీలు కలిసినరేంద్ర మోదీ నీ అవమానించిన ప్రతిసారీ, దేశ ప్రజలు ప్రధానిపై మరింతగా ఆశీస్సులు కురిపిస్తూ, తమ పూర్తి మద్దతును అందిస్తూ, ఆయన విజయాన్ని ఖాయం చేస్తూ బలమైన ప్రజాస్వామ్యబద్ధమైన సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అహంకారాన్ని, అధికార దాహాన్ని, దూషణ రాజకీయాలను భారత ప్రజలు పదేపదే తిరస్కరించారు. కాంగ్రెస్ ప్రధాని మోదీ జీని ఎంతగా దూషిస్తే, ఆయనకు ప్రజల మద్దతు అంతగా పెరుగుతుంది. ప్రజలచేత ఎన్నికైన భారత ప్రధానమంత్రిని అవమానించినందుకు, 140 కోట్ల మంది భారతీయుల మనోభావాలను దెబ్బతీసినందుకు గాను రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ తక్షణమే జాతికి క్షమాపణలు చెప్పాలి.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై మండిపడ్డ అశోకన్నా

- ఇంధన ధరల భారం ప్రజలను కుంగదీస్తోంది
- గ్యాస్ సిలిండర్ ధరల పెంపు ప్రజలపై అదనపు భారం
- కార్పొరేట్ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వ విధానాలు : విమర్శ
- ధరలు తగ్గించకపోతే బీజేపీ ప్రభుత్వం ప్రజా ఆగ్రహం ఎదుర్కొంటుంది
- ఇంధన ధరల పెంపుతో పేద, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం పడుతోంది



**మహబూబాబాద్ విశాలభారతి:** పెట్రోల్, డీజిల్ ధరలను వరుసగా పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఇంధన ధరల తగ్గింపుకోసం ఆందోళనలు నిర్వహిస్తున్న సమయంలోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మళ్లీ ధరలను పెంచడం దారుణమని విమర్శించారు. మూడు రోజుల క్రితమే పెట్రోల్, డీజిల్ ధరలను మూడు రూపాయలు పెంచిన కేంద్ర ప్రభుత్వం, మంగళవారం మరోసారి లీటరుకు 90 పైసలు పెంచడం ప్రజలపై మరింత భారాన్ని మోపే చర్య అని అశోకన్నా పేర్కొన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు పెరిగి అన్ని రంగాలపై ప్రభావం పడుతుందని అన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలు జీవన వ్యయాల పెరుగుదలతో ఆర్థికంగా కుంగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు వాణిజ్య, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలను కూడా భారీగా పెంచి బీజేపీ ప్రభుత్వం ప్రజలపై కనికరం లేకుండా భారం మోపుతోందని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని అశోకన్నా ఆరోపించారు. ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం పాలకులు పని చేస్తున్నారని, గత 12 ఏళ్లుగా పేద ప్రజల సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను దేశ ప్రజలు ప్రతి ఒక్కరూ నిరసించాలని పిలుపునిచ్చిన ఆయన, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ప్రభుత్వం ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.